


## తరుముడే.. తరుముడు..

- జాతీయ పార్టీల అభ్యర్థులపై జనాల్లో తీవ్రమైన అసంతృప్తి
- హస్తం పార్టీలో సరిపోని 'ఫోర్స్'.. లోకల్ ఫీలింగ్ తేలేకపోతున్న కమలం



# వ్యతిరేకత.. అనైక్యత

## సొంత పార్టీ నాయకుల నుంచే కొరవడిన సహకారం

మంచిర్యాల, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆదిలాబాద్ – కరీంనగర్ – నిజామాబాద్ – మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నాలుగు రోజుల సమయం మాత్రమే ఉంది. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులపై జనాల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తున్నది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. రాష్ట్రంలో ఏడాది పాలనలో కాంగ్రెస్ చేసింది ఏం లేదు. 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నా.. వీటిలో సగానికిపైగా ఉద్యోగాలు కేసీఆర్ సర్కారు హయాంలో నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించినవే ఉన్నాయి. గెలిచిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసిన కాంగ్రెస్ సర్కారు.. ఆ హామీని నిలబెట్టుకోలేకపోవడంతో గ్రాడ్యుయేట్ నిరుద్యోగులు ఆగ్రహంతో ఉన్నారు. మిగిలిన వర్గాలైన రైతులు, మహిళలు, వృద్ధులను సంతృప్తి పరచడంలో ఘోరంగా విఫలమైంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ ఉన్నా.. జిల్లాకు ఒరగబెట్టింది ఏం లేదు. గతంలోనూ ఇక్కడ ఎంపీ బీజేపీ నుంచే ఉన్నారు. నవోదయ పాఠశాల మంజూరు, సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ, రైల్వేలైన్ అంశంలో పురోగతి లేదు. ఇలా రెండు జాతీయ పార్టీలపై జనాల్లో తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తున్నది.

### కలిసి రాని నాయకులు..

జాతీయ పార్టీలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు తోడు కాంగ్రెస్, బీజేపీల్లోని క్షేత్రస్థాయి కీలక నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం, పైగా మంత్రులకు ఇన్‌చార్జి ఇవ్వడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసహనంతో ఉన్నట్లు తెలుస్తున్నది. చాలా చోట్ల మంత్రులు ప్రచారం చేయడానికి వచ్చినప్పుడే ఎమ్మెల్యేలు కనిపిస్తున్నారు తప్ప అసలు ఎమ్మెల్సీ ఎన్నికలను వాళ్లు సీరియస్‌గా తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిన నరేందర్‌రెడ్డికి కేవలం ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల్లోనే గుర్తింపు ఉందని, ఉమ్మడి నిజామాబాద్, మెదక్ జిల్లాలతోపాటు ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆయన ఫోర్స్ సరిపోవడం లేదని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. మొన్నటికి మొన్న నిర్మల్ జిల్లా ముథోల్ మీటింగ్‌లో ప్రచార కార్యక్రమంలో ఖాళీ కుర్చీలు దర్శనం ఇవ్వడం ఈ వాదనకు బలం చేకూరుస్తున్నది. ఇక బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి మెదక్ జిల్లావాసి కావడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లోకల్ ఫీలింగ్ తీసుకురాలేకపోతున్నారు. నిజామాబాద్, కరీంనగర్‌లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక బీజేపీ నుంచి టికెట్ ఆశించి భంగపడిన ఆ పార్టీలోని సీనియర్లు ఆయనకు సహకరించడం లేదని తెలిసింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీని వదిలేసి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం సదరు నాయకులు ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. ఇక బీజేపీ నుంచి పోటీ చేస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. జాతీయ పార్టీల నుంచి బరిలో ఉన్న అభ్యర్థులంతా డబ్బులున్న వారు కావడం కూడా పైసలున్నోళ్లకే టికెట్లు ఇచ్చాయనే చర్చ జనంలో నడుస్తున్నది. ఇది కూడా ఆ పార్టీల అభ్యర్థులకు మైనస్‌గా మారనుంది.

### ముందున్నంత లేదు..

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ రావడానికి ముందు ఉన్నంత వేడి ఇప్పుడు కనిపించడం లేదు. జాతీయ పార్టీ అభ్యర్థుల విషయంలో పునరాలోచన చేసి ఉంటే బాగుండేదన్నది మెజార్టీ అభిప్రాయంగా కనిపిస్తున్నది. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో పోటీ చేసే అభ్యర్థులు అన్ని ప్రాంతాలను ప్రభావితం చేసేవారై ఉండాలి. ఈ ఎన్నికల కోసం ఆయా పార్టీలు ప్రకటించిన అభ్యర్థులు కొన్ని జిల్లాలకే పరిమితం అవుతున్నారు. ఒకటి, రెండు జిల్లాల్లో తప్ప మిగిలి ప్రాంతాల్లో వారి ప్రభావం తక్కువగా కనిపిస్తున్నది. దీంతో జిల్లాకు ఓ అభ్యర్థి పేరు వినిస్తున్నది. ఈ నేపథ్యంలో గెలుపు, ఓటములను అంచనా వేయడం కష్టంగా మారింది. ముఖ్యంగా ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, స్థానిక లీడర్లు ఎమ్మెల్సీ ఎన్నికలకు సీరియస్‌గా తీసుకోకపోవడం అన్నది ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా జాతీయ పార్టీల నాయకులు ఆ పార్టీ అభ్యర్థుల కోసం నడుం బిగిస్తే తప్ప విజయం సాధించడం అంత సులభం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో ఆయా పార్టీలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటాయన్నది చర్చనీయాంశంగా మారింది.

### వాడేసుకుంటున్న ఉపాధ్యాయ లీడర్లు

ప్రస్తుతం గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయ సంఘాల హవా నడుస్తున్నది. ఇప్పటికే రెండు వర్గాలుగా ఉన్న ట్రస్మా నాయకులు ఎవరికి వారు తమకు కావాల్సిన వారికి మద్దతు ప్రకటించి ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ఇక ప్రత్యేకంగా కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయ లీడర్ల పెత్తనం ఎక్కువైపోయింది. ఉత్తర తెలంగాణలో దాదాపు 50కి పైగా విద్యాసంస్థలున్న విద్యా వ్యాపారిగా ఆయన్ని జనాలు అభివర్ణిస్తున్నారు. ఇన్ని విద్యా సంస్థలు ఉండి ఏనాడు జనాల కోసం ఏం చేయని ఆయన ఇప్పుడు ఎమ్మెల్సీగా గెలిచేందుకు ప్రజాసేవ నినాదం ఎత్తుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక ఆయన వెనకే ఉంటూ వెన్నుపోటు పొడిచేందుకు ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయ సంఘాల లీడర్లు కొందరు కత్తులు నూరుతున్నట్లు తెలుస్తున్నది. ఎలాగైనా సార్‌తో డబ్బులు ఖర్చు పెట్టించి, ఆయన్ని ఓడించడమే లక్ష్యంగా ఆ కొందరు ఉపాధ్యాయ నాయకులు కంకణం కట్టుకున్నారనే ప్రచారం ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక బీజేపీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విషయంలోనూ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఈ వ్యూహాన్నే అనుసరిస్తున్నారు. ఇది కూడా ఈ అభ్యర్థులకు కష్టాలు తీసుకురానుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పోడు భూముల సాగును అడ్డుకుంటే ఊరుకోం

- పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతాం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

బెజ్జూర్, ఫిబ్రవరి 22 : పోడు భూములు సాగు చేయకుండా అడ్డుకుంటే ఊరుకునేది లేదని, పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం మర్తిడి, బెజ్జూర్ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాపన్‌పేటకు చెందిన రైతులు పోడు భూములు సాగు చేయడానికి సిద్ధమవుతున్నారని, అటవీ అధికారులు భూములు చదును చేయకుండా అడ్డుకుంటామనడం సరికాదన్నారు. రైతులు 30–40 ఏళ్లుగా వన్యప్రాణులకు హాని చేయకుండా పోడు భూములు సాగు చేసుకొని బతుకుతున్నారని, కందకాల ఇవతలివైపు ఉన్నభూముల్లోనే రైతులు సాగు చేస్తున్నారని, అడవికి ఎలాంటి నష్టం చేయడం లేదన్నారు. అలాగే నాలుగేళ్ల క్రితం మండల కేంద్రంలో మాలీ సంఘ భవనానికి స్థలం కేటాయించారని, భవనం ఏర్పాటు చేసిన తర్వాత తహసీల్దార్ ఆ స్థలం ఇవ్వలేదని అనడం కరెక్టు కాదన్నారు. కొందరు ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బూస సారయ్య, యూత్ మండల అధ్యక్షుడు దుర్గం తిరుపతి, నియోజక వర్గ యూత్ కన్వీనర్ కాసిపాక రాజు, నాయకులు చందు, మోహన్, షంషొద్దీన్ బాబు, తలండి భిక్షపతి, ఆత్రం హరీశ్, సూర్ల ఇస్తారి, శ్రీనివాస్, తరుణ్, రాందాస్, నాందేవ్, తొడ్షం శంకర్, ముకుంద్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

# సన్నరకానికి బోనస్ ఇంకెప్పుడు?

- కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ ఆగ్రహం
- దండేపల్లి మండల కేంద్రంలో ధర్నా
- రైతులతో కలిసి బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, ఫిబ్రవరి 22 : సన్న రకం ధాన్యానికి ప్రకటించిన రూ.500 బోనస్ ఇంకెప్పుడిస్తారంటూ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. ఈ మేరకు శనివారం దండేపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గ రైతులకు బోనస్ కింద ఇంకా 98 శాతం డబ్బులు రావాల్సి ఉందన్నారు. కనీసం గ్రామానికి ఒకరి చొప్పున కూడా బోనస్ వేయని ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఎద్దేవా చేశారు. బోనస్ పేరిట బోగస్ మాటలు చెప్పిన ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో సన్న వడ్లకు ఇంకా రూ.7.50 కోట్ల బోనస్ డబ్బులు రావాల్సి ఉందన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ వారి పక్షాన ఆందోళనలు చేపడుతామన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై పడుకొని నిరసన తెలిపారు. దండేపల్లి, లక్షెట్టిపేట ఎస్ఐలు తహసినొద్దీన్, సతీశ్ అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు స్థానిక పద్మశాలి భవన్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్, యువ నాయకుడు విజిత్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, వైస్ చైర్మన్ అక్కల రవి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్, బీఆర్ఎస్ నాయకులు పొడేటి శ్రీనివాస్‌గౌడ్, పాదం శ్రీనివాస్, గోళ్ల రాజమల్లు, గొట్ల భూమన్న, రేని శ్రీనివాస్, బొలిశెట్టి రమేశ్, నక్క తిరుపతి, ముద్దసాని తిరుపతి, బచ్చల అంజన్న, రాజిరెడ్డి, మల్లయ్య, అల్లంల సంతోష్, వెంకటరమణ, అఫ్సర్, ఉస్మాన్ ఖాన్, రవికుమార్, అఖిల్, రాకేశ్, సాయి, హరీశ్, పవన్, తిరుపతి, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఎమ్మెల్యే ఫైర్

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 22 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ సమీపంలో శనివారం సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహించారు. అధికారులు, ఉత్సవ నిర్వాహకులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఫైర్ అయ్యారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వేడుకల్లో తనకు గుర్తింపు ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సైతం తన ఫొటో లేదని, కేవలం కాంగ్రెస్ నాయకుల ఫొటోలను ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. అధికారులు, నిర్వాహకులు ఎమ్మెల్యే కోవ లక్ష్మికి క్షమాపణ చెప్పి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఆమె సభను వాకౌట్ చేసి వెళ్లిపోయారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



మంచిర్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద దుబ్బపల్లి గ్రామస్తులు

# నాయకులే మా పొట్ట కొడుతున్నరు

- కమీషన్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురిచేస్తున్నరు
- దుబ్బపల్లి గ్రామస్తుల ఆవేదన
- పరిహారం అందేలా చూడాలని కలెక్టరేట్‌లో వినతి

జైపూర్, ఫిబ్రవరి 22 : మా ఊరి పెద్దలు, నాయకులే మా పొట్ట కొడుతున్నారని రామరావుపేట గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బపల్లి గ్రామానికి చెందిన కామెర రాజం, దుర్గయ్య, తిరుపతి, రాజం, నాగలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నేరుగా కలెక్టరేట్‌కు వచ్చి తమ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. 2018లో శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు విస్తరణ పేరుతో తమ గ్రామాన్ని సింగరేణి అధికారులు సర్వే చేశారన్నారు. సర్వేలో 200పై చిలుకు ఇండ్లు ఉండగా, అధికారులు రికార్డు చేసుకున్నారని, కానీ, ఆపై ఈ ఇండ్లన్నీ పరిహారం కోసం నిర్మించుకున్నవని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎంపిక నిలిచిపోయిందని వారు పేర్కొన్నారు. రెండోసారి సర్వే నిర్వహించిన సింగరేణి, రెవెన్యూ అధికారుల బృందం అర్హుల ఎంపికను వెల్లడించకుండా నిలిపివేసినట్లు తెలిపారు. సర్వేకు ముందే తమ గ్రామంలో 200 ఇండ్లు ఉండేవని, స్థానిక నాయకులకు కమీషన్‌లు ఇవ్వకపోవడంతో కక్షగట్టి అడుగడుగునా అడ్డు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని తమకు న్యాయమైన పరిహారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మరోసారి అడ్డుపడాలని చూస్తే అందరి బాగోతం పేర్లతో సహా బట్టబయలు చేస్తామన్నారు. ఇప్పటికీ దుబ్బపల్లిలో 166 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఓపెన్ కాస్టు పూర్తిగా గ్రామానికి దగ్గరగా రావడంతో దుమ్ము, బ్లాస్టింగ్‌లతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు జనగామ విజయ, కామెర జగదీశ్వరి, సల్లూరి చంద్రమతి, జాడి పద్మ, కామెర లక్ష్మి, కోట లక్ష్మి, కామెర మల్లు ఉన్నారు.

# ఎన్నికలు బాధ్యతాయుతంగా నిర్వహించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 22 : ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ నియోజకవర్గ ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు రోజు ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, కవర్లు, డైరీలను పోలింగ్ సిబ్బందికి అందజేయడం జరుగుతుందని, మెటీరియల్ తీసుకున్న తర్వాత అధికారులు, సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. 27న ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియను ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే